# భారత దేశంలో లోపభూయిష్ట వైద్య పరికరాల అమ్మకంద్వారా

# బహుళజాతి కంపెనీలు సాగిస్తోన్న దోపిడీ

**కార్పొరేటు** యాజమాన్యం, కార్పొరేటు నీతిసూత్రాలు మరియు కార్పొరేటు సామాజిక బాధ్యతలవంటి వాని 'గొప్ప లక్షణాల' గురించి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణను దాని సరళీకరణ ఆర్థిక విధానాలను సమర్థించే వారంతా చాలా గొప్పగా ప్రవచిస్తూ వుంటారు. కానీ ఇవన్నీ శుష్క నినాదాలేనని, తప్పుడు ప్రకటనలు, ప్రచారాలతో ప్రజలను మోసగించటంద్వారా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు తమ నీచమైన సూపర్ లాభార్జనలను మరింతగా పోగేసుకుంటున్నాయని స్పష్టమౌతోంది.

సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల నిట్టనిలువు దోపిడీనుండి, మోసకారీతనంనుండి ప్రజలను పరిరక్షించాల్సిన పాలకులు, ప్రభుత్వాలు, ప్రభుత్వ నియంత్రణా సంస్థలు కూడా ఈ లూటీలో భాగస్వామ్యమవుతున్న విషయాన్ని రోజురోజుకీ ప్రజలు తమ నిత్యజీవిత అనుభవాలనుండి గమనిస్తూ వున్నారు.

జాన్సన్ అండ్ జాన్సన్ అనే అతిపెద్ద అమెరికా బహుళజాతి ఔషధ తయారీ కంపెనీ, భారత దేశంలోని తన అనుబంధ సంస్థ 'డీపై' ద్వారా ఏఎస్ఆర్ – ఆర్టిక్యులర్ సర్ఫేస్ రీప్లేస్‌మెంట్ – తుంటిమార్పిడి పరికరాలను విస్తృతంగా భారతదేశ వైద్యమార్కెట్‌లో అమ్మకం సాగించింది. ఆస్ట్రేలియాలో ప్రజలపై ప్రయోగించిన ఇవే పరికరాలు విఫలమైన తర్వాత కూడా జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ మనదేశంలో తుంటిమార్పిడి అవసరమైన వారికి ఈ పరికరాలను విస్తృతంగా అమ్మటం, బాహాటంగా లూటీ సాగిస్తున్న తీరుకు ఓ నమూనాగా నిలుస్తోంది.

మనదేశంలో ఏటా ఒక లక్షకు పైగా తుంటి, కీళ్ళమార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతూవుంటాయి. వీటిలో 70 వేల నుండి 80 వేల వరకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు కాగా, 20 వేల నుండి 30 వేల దాకా తుంటికీలు మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయనేది ఒక అంచనా.

2006లో భారత ఔషధ నియంత్రణ సంస్థ డిజిసిఐ, జాన్సన్ అండ్ జాన్సన్‌కు చెందిన 'డీపై' కంపెనీ ద్వారా తుంటి మార్పిడి పరికరాల కొనుగోలుకు, వాటి దిగుమతికి అనుమతి మంజూరు చేసింది. తుంటిమార్పిడి కోరుకుంటున్న యువ పేషెంట్స్‌కు ఏఎస్ఆర్ తుంటి మార్పిడి పరికరాలు మన్నికైన, నాణ్యమైన, అత్యున్నత ప్రమాణాలు కలిగినవిగా ఆ సమయంలో ఆ కంపెనీ విస్తృత ప్రచారం గావించుకుంది. అత్యధిక ఎముకల శస్త్రచికిత్సల అనంతరం 10 నుండి 15 సం॥ల తర్వాత తిరిగి ఆ భాగంలోనే శస్త్ర చికిత్స చేయవలసి వస్తున్నదని, అదే ఏఎస్ఆర్ తుంటిమార్పిడి పరికరాలను అమరిస్తే 20 నుండి 25 సం॥ల జీవితకాలం నిశ్చింతగా వుండవచ్చునని ప్రచారం చేసుకుంటూ ఆ కంపెనీ తన పరికరాలను విస్తృతంగా మార్కెట్‌లో అమ్ముకుంది. ఆనాటికి వాడకంలోనున్న తుంటిమార్పిడి పరికరాలలో వినియోగించే లోహాలకంటే తమ పరికరాలలో వినియోగించే లోహాలు, పరికరాల నిర్మాణం చాలా విశిష్టమైనవనే అంశాన్ని ఆ కంపెనీ తన ప్రచారంలో విస్తృతంగా చేసింది.

జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి చెందిన భారత అనుబంధ ముంబైకి చెందిన 'డీపై' మెడికల్ ప్రైవేట్ లిమిటెడ్ భారతదేశంలోకి 2006–2010 మధ్యకాలంలో 15,289 ఏఎస్ఆర్ తుంటిమార్పిడి పరికరాలను దిగుమతి చేసుకుంది. ఒక్కో తుంటి మార్పిడి విభాగాల మొత్తాన్ని రూ.90,000 నుండి 1,20,000 రూ॥గా విక్రయించింది. కాగా, తుంటిమార్పిడి శస్త్రచికిత్స నిర్వహణా వ్యయం రూ.2,50,000 నుండి 4,00,000 వరకు వుంది.

జాన్సన్ అండ్ జాన్సన్ రూపొందించి విక్రయిస్తున్న ఏఎస్ఆర్ కీళ్ళ, తుంటిమార్పిడి పరికరాలనుపయోగించినప్పటికీ, కొద్దికాలానికే తిరిగి శస్త్రచికిత్స చేయవలసి వస్తున్న విషయాన్ని గుర్తించి, 2009 సం॥నాటికే ఏఎస్ఆర్ కీళ్ళ, తుంటిమార్పిడి పరికరాలను ఆస్ట్రేలియాకు చెందిన జాతీయ కీళ్ళమార్పిడి సంస్థ, తమదేశ వైద్య మార్కెట్ నుండి ఉపసంహరించింది. ఈ పరికరాలనుపయోగించి శస్త్రచికిత్స జరుపుకున్న వారిలో 12 నుండి 13 శాతం పేషెంట్స్, 5 సం॥ల లోపుగానే తిరిగి శస్త్రచికిత్స చేయించుకోవలసి వస్తున్నదని ఇంగ్లండులోని ఓ సంయుక్త అధ్యయన సంస్థ వెల్లడి చేసింది. దీనితో చివరకు 2010 ఆగస్టులోనే ప్రపంచవ్యాపితంగా జాన్సన్ అండ్ జాన్సన్ రూపొందించిన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాలను వెనక్కు తీసుకోవాలని అనేక దేశాలు నిర్ణయించాయి.

సరిగ్గా ఈ సమయానికి మనదేశంలో 4700 మందికి ఏఎస్ఆర్ శస్త్రచికిత్సలు జరిగి, వీరిలో 4,500 మందికి డీపై ద్వారా సరఫరా చేయబడిన జాన్సన్ అండ్ జాన్సన్ రూపొందించిన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాలను అమర్చటం జరిగింది.

వీరిలో కొందరు అనతికాలంలోనే తీవ్రమైన నొప్పితో బాధపడటమేకాక పూర్తిగా మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ పేషెంట్ల ఎక్స్‌రేలను పరిశీలించిన డాక్టర్లు, పేషెంట్స్‌కు అమర్చిన పరికరాలు సంపూర్తిగా సక్రమంగా వున్నాయని, వారు వ్యక్తంచేస్తున్న బాధ కేవలం వారి మనోగతమైందని చెప్పారు.

అయితే పేషెంట్ శరీరంలో అమర్చిన పరికరం తాలూకూ లోహ అవశేషాలు ప్రధానంగా కోబాల్ట్, క్రోమియం అవశేషాలు తీవ్రమైన నొప్పులను, నరాల వైకల్యాన్ని, తదితర అనేక రోగ లక్షణాలను పేషెంట్స్‌కు కల్పించాయి.

జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ రూపొందించిన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాల నాణ్యతా ప్రమాణాలు సరిగాలేవని, దిగజారి వున్నాయని, పూర్తిగా వెల్లడి అయిన నేపథ్యంలో 2010 ఆగస్టు నుండి ఈ సంస్థ తన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాలను ప్రపంచమార్కెట్ నుండి ఉపసంహ రించుకుంది.

అయితే, జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీగానీ, దాని అనుబంధ సంస్థ అయిన మనదేశంలోని 'డీపై' మెడికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థగానీ ఈ విషయాన్ని బాధితులైన పేషెంట్స్‌కు సరిగ్గా చేరవేయకపోవటంతోపాటు, తిరిగి వారిని మరో శస్త్రచికిత్స చేయించుకోమని సలహా ఇవ్వటం జరగలేదు. జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ కుట్ర పూరితంగా బాధితులైన పేషెంట్స్‌పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, తాము రూపొందించిన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాల వలన సంభవిస్తున్న దుష్పరిణామాలను గురించిన కీలకమైన సమాచారాన్ని వారికి చేరవేయకుండా దాచి వుంచింది. ఆవిధంగా జాన్సన్ అండ్ జాన్సన్, దాని అనుబంధ సంస్థ నేరపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి.

సామాజిక మాధ్యమాలద్వారా, అంతర్జాలం మొదలైన మాధ్యమాల ద్వారా ప్రపంచంలో ఏ మూలనున్న వ్యక్తికైనా ఏ వార్తలు లేదా ఏ సమాచారమైనా ఇట్టే తెలుసుకోగలుగుతున్నారని అనవచ్చు.

అయితే, ఆశ్చర్యకరంగా బాధితులైన పేషెంట్లుగానీ (వీరిలో అత్యధికులు అంతర్జాలాన్ని, సామాజిక మాధ్యమాలను ఉపయోగించేవారే), మనదేశ పాలకులుగానీ లేదా ప్రభుత్వ నియంత్రణా సంస్థలుగానీ లేదా వైద్యులుకానీ – ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాల వైఫల్యస్థాయి గురించిన వార్తలనుగానీ, అవి కలిగించిన నష్టాలనుగానీ బాధిత పేషెంట్స్‌కు చేరవేసి వారిని అప్రమత్తం చేయలేకపోయారు.

ఇది కేవలం ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాల గురించిన వార్తలను పట్టించుకోకపోవటంలో వైఫల్యంగా మాత్రమేగాక బాధిత పేషెంట్ల పట్ల తమ బాధ్యతను ఉద్దేశ్యపూరితంగా పట్టించుకొనని అంతర్జాతీయ స్థాయి నేరపూరిత నిర్లక్ష్యంగా, పద్ధతి ప్రకారం సాగించిన కుట్రగా భావించాలి.

జాన్సన్ అండ్ జాన్సన్ రూపొందించిన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాల వైఫల్యం గురించి మనదేశంలో మొదటగా మహారాష్ట్రకు చెందిన ఆహార, ఔషధ పరిపాలన (ఎఫ్‌డిఏ) అధికారి జోగ్‌డే గొంతెత్తాడు. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ తమ తప్పుడు పరికరాల గురించి బాధిత పేషెంట్లకు తగినవిధంగా హెచ్చరికలు చేయక పోవటంపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే 'కేంద్ర ఔషధాల స్థాయి, నియంత్రణ సంస్థ' (సిడిఎస్‌సిఓ)కు కూడా ఈ అంశాల్ని ఆయన తెలియబరిచి, దీనిపై సరైన చర్య తీసుకోవలసిందిగా కూడా కోరాడు.

అయినప్పటికీ కేంద్ర సంస్థ అయిన సిడిఎస్‌సిఓ గానీ, వివిధ రాష్ట్రాలలోని ఆహార, ఔషధ సంస్థలు గానీ లోపభూయిష్ట పరికరాలతో తప్పులకు పాల్పడుతన్న కంపెనీపై నేరారోపణచేసి, వారు రూపొందించిన తప్పుడు పరికరాలకు వారిని బాధ్యులుగా చేస్తూ వారిపై చర్యలు తీసుకోవటానికి ముందుకు రాలేదు.

కేంద్రప్రభుత్వ సిడిఎస్‌సిఓ దీనిపై స్పందించి, తన అధికారిక వెబ్‌సైట్‌లో జాన్సన్ అండ్ జాన్సన్ రూపొందించిన ఏఎస్ఆర్ కీళ్ళమార్పిడి పరికరాల గురించి కొన్ని హెచ్చరికలను ప్రచురించటానికి రెండు సంవత్సరాల కాలం పట్టింది. దీనిపై 'నిపుణుల కమిటీ నివేదిక'ను పొందటానికి ఆరు సంవత్సరాల పైగా కాలం పట్టింది. నిపుణుల కమిటీ నివేదిక 2018 ఫిబ్రవరిలోనే సమర్పించి నప్పటికీ, ఆరునెలల తర్వాత 2018 ఆగస్టు చివరి వారంలోగానీ ఆ నివేదిక ప్రజలమధ్యకు రాలేదు. తప్పుడు పరికరాలతో తుంటి, కీళ్ళమార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి నష్టపరిహారం కోరి, ఇప్పించటంలో సిడిఎస్‌సిఓ సంస్థ క్రియాశీలకంగా లేదు. ఆ సంస్థపై పెద్దఎత్తున దాడి జరిగిన తర్వాతనే ఆ నివేదిక అయినా వెలుగుజూసింది.

జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీతో చెట్టాపట్టా లేసుకునివున్న ప్రభుత్వం, ఈ విధంగా ఒక నిర్దిష్టమైన అభిప్రాయానికి రాకుండా దాదాపు 8 సంవత్సరాలు బాధితులైన పేషెంట్లకు పరిహారం సాధించకుండా కాలం గడిపింది. ప్రభుత్వం ఇప్పుడు కూడా కేవలం కంటితుడుపు చర్యలకే పాల్పడుతోందని బాధితులైన పేషెంట్స్ పేర్కొంటున్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన ప్రభుత్వ బృందం బాధితులైన పేషెంట్ ఒక్కొక్కరికి 20 లక్షల రూ॥ పరిహారం ఇవ్వమని జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీని కోరనున్నారు. పరిహార నిర్ధారణ క్రమం "పారదర్శకంగా, పక్షపాత రహితంగా జరగలేదని, బహుళజాతి ఔషధ సంస్థకు అనుకూలంగా జరిగిందని" బాధితులైన పేషెంట్లు ప్రభుత్వ బృందంపై ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ చర్యకూడా చాలా తొందరపాటుతో కూడుకున్నదని వారు ప్రకటిస్తున్నారు. 'నష్టపోయిన, శారీరకంగా తీవ్ర బాధలకు లోనైన బాధిత పేషెంట్స్‌లో ఏ ఒక్కరూ ఒక్కసారి కూడా జాన్సన్ అండ్ జాన్సన్ ప్రతినిధులతో ముఖాముఖీ చర్చలు జరపకుండానే, ప్రభుత్వ బృందమే జాన్సన్ అండ్ జాన్సన్ బృందంతో సన్నిహితంగా చర్చలు జరపటంపట్ల వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు.

బాధితులైన పేషెంట్ల ఆరోపణలు న్యాయమైనవీ, సరైనవి కూడా. ప్రభుత్వాల, పాలకుల ఈ విధమైన దుర్మార్గ పూరితమైన నిర్లక్ష్యం ఈనాడే కొత్తగా ఏర్పడింది కాదు. అమెరికాకు చెందిన యూనియన్ కార్బైడ్ సంస్థ సృష్టించిన భోపాల్ విషవాయు విధ్వంస బాధితుల పట్ల మన పాలకులు, వరుసగా వచ్చిన ప్రభుత్వాలు ఇదేవిధమైన నిర్లక్ష్యం వహించాయి.

2010లో ఏఎస్ఆర్ తుంటి, కీళ్ళమార్పిడి పరికరాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రపంచంలో అనేక దేశాలు ప్రకటించిన

నేపథ్యంలో జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ బాధిత పేషెంట్లకు పెద్దమొత్తంలో పరిహారాలను చెల్లించింది. అయితే మనదేశంలోని బాధితులైన పేషెంట్లకు ఏమాత్రం పరిహారం చెల్లించకుండానే చేతులు దులుపుకో దలచుకుంది. కేంద్రప్రభుత్వ సిడిఎస్‌సిఒకు మహారాష్ట్ర ప్రభుత్వ ఎఫ్‌డిఏ సలహా తర్వాతనైనా సరైన చర్య తీసుకొని న్యాయపరమైన వ్యాజ్యం వేసి వుండవచ్చు. అమెరికాలో ఈ తరహా బాధితులైన 8 వేలమంది పేషెంట్లకు జాన్సన్ అండ్ జాన్సన్ యాజమాన్యం 250 కోట్ల డాలర్లను (షుమారు 18,000 కోట్ల రూ॥) పరిహారంగా చెల్లించటానికి అంగీకరించింది. అయితే భారత దేశంలో బాధిత పేషెంట్ల బాధ్యత చేపట్టటానికి ఆ కంపెనీ సిద్ధం కాలేదు.

భారతదేశంలోని 1940 నాటి ఔషధ, కాస్మోటిక్స్ చట్టమే వైద్యపరికరాలను కూడా నియంత్రిస్తుంది. పరిస్థితులు వికటిస్తే, దుష్ఫలితాలు సంభవిస్తే చెల్లించాల్సిన నష్టపరిహారం గురించి ఆ చట్టంలో స్పష్టంగా పేర్కొనలేదనే అంశాన్ని సాకుగా చేసుకొని న్యాయస్థానాల్లో వాదనలు సాగించారు. దీని పేరుతో బాధిత పేషెంట్లపట్ల దుర్మార్గానికి పాల్పడిన కంపెనీనుండి నష్ట పరిహారాన్ని డిమాండ్ చేయటంలో, తప్పుడు పరికరాలకు ఆ యాజమాన్యాలను బాధ్యులుగా నిలపటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణా సంస్థలు బలహీనంగా వ్యవహరించాయి. ఇలాంటి వాదనలు నిరుపయోగమైనవి. ఒక సార్వభౌమ దేశంగా భారతప్రభుత్వం జాన్సన్ అండ్ జాన్సన్‌ను బాధ్యురాలిగా చేస్తూ ప్రత్యేక ఆర్డినెన్స్ వంటి వాటిద్వారా కూడా దోషిగా నిలబెట్టటానికి అన్ని అవకాశాలూ వున్నాయి.

అయితే ఈవిధమైన కార్యాచరణకు మన పాలకులు, ప్రభుత్వాలు సంసిద్ధంగా లేరు. భారత ప్రజానీకంతోపాటు బాధితులైన పేషెంట్ల ప్రాణాలను పణంగా పెట్టి అయినా భారతదేశంలో సులభంగా లాభాలార్జించటానికి బహుళజాతి కార్పొరేషన్లకు అత్యధిక అవకాశాలను కల్పించే విధంగా మన దేశ పాలకులు, ప్రభుత్వాలు పనిగట్టుకొని వ్యవహరిస్తున్నారు.

మరోవైపున జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ తన బాధ్యతను ఎగవేయడానికి వీలైన దార్లన్నింటినీ వెదుక్కొని, సిద్ధంగా వుంది. తీవ్ర బాధలకు గురైన బాధిత పేషెంట్లను గాలికొదిలేయదలచుకుంది. ఏఎస్ఆర్ తుంటి, కీళ్ళమార్పిడి శస్త్రచికిత్సలు జరిపే శస్త్రవైద్యులందరికీ 2010 ఆగస్టు 24న తాను ఒక నోటీసు పంపినట్లుగా జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ వాదిస్తోంది. "అత్యవసర క్షేత్రస్థాయి భద్రతా" నోటీసుగా పేర్కొనబడే దానిలో ఏఎస్ఆర్ పరికరాలు అమర్చటాన్ని ఆపివేయమని కోరామని, ఏఎస్ఆర్–హెల్ప్‌లైన్ వివరాలతోపాటు రీఇంబర్స్‌మెంట్ క్రమాన్ని గురించి కూడా అందులో తెలియజేశామని పేర్కొంటోంది. అయితే జాన్సన్ అండ్ జాన్సన్ యాజమాన్యం నుండి తమకు ఆవిధమైన నోటీసులుగానీ, సిడిఎస్‌సిఒ నుండి హెచ్చరిస్తూ చేసిన ప్రకటనగానీ అందలేదని శస్త్రవైద్యులు ప్రకటించారు. కానీ 'డీపై' కంపెనీ ఏర్పాటు చేసిందని చెబుతున్న ఏఎస్ఆర్ – హెల్ప్‌లైన్ కూడా పేషెంట్లకు ఏవిధమైన సహాయాన్నీ చేయలేదు. కంపెనీ యాజమాన్యం బాధిత పేషెంట్లకు ఎలాంటి సహకారం అందించకపోగా, హెల్ప్‌లైన్‌లో తమ గోడు వెళ్ళబోసుకున్న వారికి సైతం "తీవ్ర సమస్యలు ఎదురైనప్పుడు తిరిగి ఫోన్ చేయండి" అని సమాధానమిచ్చారు. హెల్ప్‌లైన్‌ద్వారా వారిని సంప్రదించిన బాధిత పేషెంట్లు ఎదుర్కొనే సమస్య ఏమంత పెద్ద సమస్య కానే కాదంటూ దురుసుగా వ్యవహరించారని బాధితులు పేర్కొన్నారు. ఈవిధంగా జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఉద్దేశ్యపూర్వకంగానే తమ జవాబుదారీ తనం, బాధ్యతలకు ఎగనామం పెట్టింది.

ఏఎస్ఆర్ తుంటిమార్పిడి పరికరాలు లోపభూయిష్టమైనవనే సమాచారాన్ని దాచిపెట్టిన నేరపూరిత నిర్లక్ష్యం వెల్లడైన తర్వాత కూడా మనదేశంలోని బాధిత పేషెంట్ల లూటీకి పాల్పడిన జాన్సన్ అండ్ జాన్సన్ యాజమాన్యం ఏనాడూ తమ నేరాన్నుండి బయటపడేందుకు, తన కంపెనీ రూపొందించిన తప్పుడు పరికరాలవలన బాధితులైన వారిని ఆదుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. 2017 నాటికి కంపెనీ తన హెల్ప్‌లైన్‌ను కూడా మూసివేసింది. లోపభూయిష్టమైన తుంటి, కీళ్ళ పరికరాలను అమర్చుకున్న బాధిత పేషెంట్ల సంఖ్య మనదేశంలో 4,500 కాగా, హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించిన వారి సంఖ్య కేవలం 275 మంది మాత్రమే. వీరికి తిరిగి శస్త్రచికిత్సలు చేయించుకోమని చెప్పారేకానీ, ఒక్క పేషెంట్‌కు కూడా పరిహారం ఇవ్వటం జరగలేదు.

పైగా, 'ఇండియన్ సొసైటీ ఆఫ్ హిప్ అండ్ నీ సర్జన్స్' (ఐఎస్‌హెచ్‌కెఎస్) స్థాపించిన తుంటి, కీళ్ళమార్పిడికి సంబంధించిన సంయుక్త సంస్థ బాధిత పేషెంట్ల గురించిన సరైన సమాచారాన్ని తమకు అందజేయకపోవటంవలననే, తాము వారందరినీ కలవలేకపోయామని జాన్సన్ అండ్ జాన్సన్ యాజమాన్యం వాదన చేస్తోంది. ఏఎస్ఆర్ తుంటి, కీళ్ళపరికరాల పంపిణీదారులనుండి బాధిత పేషెంట్ల వివరాలను తెలుసుకోవడం కంపెనీ యాజమాన్యానికి చాలా సులభమైన పని. అయినా, తమకు సరైన వివరాలందజేయలేదనే పసలేని వాదన చేస్తోంది. జాన్సన్ అండ్ జాన్సన్ చేసిన పసలేని, పనికిమాలిన వాదనలను సమర్ధంగా ఎదుర్కొని సవాల్ విసరటంలో, బాధిత పేషెంట్ల ప్రయోజనాల కోసం నిలబడటంలో భారత పాలకులు, అధికార యంత్రాంగం యధా ప్రకారం ఉద్దేశ్యపూర్వకంగా విఫలమయ్యారు.

బాధిత పేషెంట్లకు న్యాయాన్ని అంద జేయటంలో జాన్సన్ అండ్ జాన్సన్ యాజమాన్యంతో సహా ప్రభుత్వ నియంత్రణా సంస్థలు, వైద్యులు, ఆసుపత్రులు, వినియోగదారుల సమూహాలు తమ బాధ్యతలను నిర్వర్తించటంలో విఫలమయ్యాయి.

కేంద్రప్రభుత్వ నియంత్రణా సంస్థ అయిన సిడిఎస్‌సిఒ ప్రదర్శించిన ఈ ఘోరమైన నిర్లక్ష్యం – బహుళజాతి కంపెనీల సంపూర్ణ నియంత్రణలో "ఔషధ పరిశ్రమ ఎంతగా కూరుకుపోయి వుందనే" అంశాన్ని తెలియజెపుతున్నదన్న మహారాష్ట్ర మాజీ ఎఫ్‌డిఏ కమిషనర్ జోగ్‌దే వ్యాఖ్యలు అక్షర సత్యం.

జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి సూపర్ లాభాలు సంపాదించాలనే వ్యాపార ధోరణి వుండగా, శస్త్రచికిత్స చేసే వైద్యులు బాధిత పేషెంట్లకు ఈ వాస్తవాలను చెప్పేందుకు సిద్ధం కాలేదు. వైద్యులకు, ఔషధ కంపెనీలకు మధ్య లోతుగా పెనవేసుకున్న బంధమే దీనికి కారణం. ఔషధ కంపెనీలు ఇచ్చే కమీషన్లు, కాన్ఫరెన్సులను ప్రాయోజితం చేయటంవంటివి వైద్యులు నోరు మెదపకుండా వుండటానికి కారణం. 2016లో జరిగిన ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ (ఐఓఏ)లో 6 వేల మందికి పైగా డాక్టర్లు ఈ అంశాన్ని గురించి విస్తృతంగా చర్చించుకున్నప్పటికీ బాధిత పేషెంట్లపట్ల నిర్లక్ష్యంగానూ, జాన్సన్ అండ్ జాన్సన్ రూపొందించిన తప్పుడు తుంటి, కీళ్ళ మార్పిడి పరికరాల గురించి తెలియజేయకుండా మౌనంగానూ వున్నారు.

తీవ్రంగా బాధితులైన పేషెంట్లకు న్యాయాన్ని చేకూర్చే తమ బాధ్యతపట్ల భారత ప్రభుత్వం, భారత ప్రభుత్వ నియంత్రణా సంస్థలు తెలిసి తెలిసీ, ఉద్దేశ్యపూర్వకంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించటంలో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీతో వారి కుమ్మక్కే ప్రధాన కారణం.

భోపాల్ విషవాయు వినాశం మొదలుకొని పాలకులంతా, ప్రభుత్వాలన్నీ సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల నేరపూరిత ప్రయోజనాలకు బహుదా సేవజేసేందుకే, అందుకై భారత ప్రజల ప్రాణాలను, ప్రయోజనాలను నిర్దాక్షిణ్యంగా బలిచేసేందుకే కృషి చేస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రభువుల ముందు సాగిలపడిన భారత పాలకుల దళారీ స్వభావాన్ని ఇవి నగ్నంగా తెలియ జేస్తున్నాయి.

ఔషధ రంగంలో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ మనదేశంలో ఈ స్థాయిలో ఆధిపత్యం చెలాయిస్తూ, తన ప్రయోజనాలను నెరవేర్చుకో గలగటానికి ఇదే మూలకారణం.

భారత ప్రజల ప్రాణాలను బలిపెట్టి అయినా సరే, సామ్రాజ్యవాద ప్రభువుల ప్రయోజనాలకు సేవజేయటమనేది భారత సామాజిక వ్యవస్థలో అంతర్గతంగా వున్న దోపిడీవర్గ స్వభావాన్ని తెలుపుతోంది.

ప్రస్తుత కుళ్ళిన ఈ వ్యవస్థను కూలద్రోసి దోపిడీ, అసమానతలు, వ్యక్తిగత ఆస్థిలేని సామ్యవాద సామాజిక వ్యవస్థను స్థాపించుకునేంత వరకూ, జాన్సన్ అండ్ జాన్సన్ వంటి బహుళజాతి కంపెనీలు పేషెంట్ల ప్రాణాలను బలిపెట్టి సాగించే సూపర్ లాభార్జనల దాహాన్ని నిరోధించటం అసాధ్యం.

సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు ప్రజలపై సాగిస్తున్న దోపిడీ గురించి, మోసాలు, నేరాల గురించి భారత ప్రజలు అప్రమత్తంగా వుండాలి. అంతేగాక ఈ దోపిడీని కూలద్రోసేందుకు, ప్రజావ్యతిరేక ప్రయోజనాలను పరిరక్షించే ప్రస్తుత వ్యవస్థను రూపుమాపేందుకు తగిన చైతన్యాన్ని వారు పెంపొందించుకోవాలి. ఈ విధంగా ప్రజల ప్రజాతంత్ర వ్యవస్థను మనదేశంలో స్థాపించటానికి పూనుకోవాలి.

oooooo